# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశంలో అందరి సమిష్టి కృషితో క్షయ వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.**
2. **ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ రెండురోజుల పాటు కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు.**
3. **తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఏరేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**
4. **రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి వి. అనిత పేర్కొన్నారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయి.**

==========================

దేశంలో అందరి సమిష్టి కృషితో క్షయ వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య తగ్గుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. క్షయ రహిత భారతదేశం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ –డబ్ల్యుహెచ్‌ఓ నివేదిక ప్రకారం 2015 నుండి 2023 వరకు భారతదేశం క్షయ వ్యాధి వ్యాప్తిలో 17.7 శాతం క్షీణతను నమోదు చేసిందని వెల్లడించారు. టీబీ వ్యాధిగ్రస్తుల కోసం "ని – క్షయ్ పోషణ్ యోజన" వంటి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా కేంద్ర ప్రభుత్వం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమాన్ని బలోపేతం చేసిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ రెండురోజుల పాటు కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని పిఠాపురం నియోజకవర్గంలో ఈ రోజు, రేపు పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. గన్నవరం నుంచి రాజమహేంద్రవరం విమానాశ్రయం చేరుకొని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో గొల్లప్రోలు జిల్లా పరిషత్ పాఠశాలకు చేరుకుంటారు. అక్కడ సైన్స్ ల్యాబ్ ప్రారంభించి అనంతరం గొల్లప్రోలు హౌసింగ్ కాలనీ, సూరంపేటవంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. నియోజకవర్గం అభివృద్ధిపై అధికారులతో సమీక్ష జరపనున్నారని అధికారులు తెలిపారు.

---------------------------

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కమిషన్ ఏర్పాటు పై రాష్ట్ర మంత్రులు, సంబంధిత అధికారులతో గత రాత్రి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక కమిషన్ ఏర్పాటుపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఈ నెల 6వ తేదీ నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల గణన ప్రారంభం కానుందని, ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా, ఉండేందుకు కోర్టు తీర్పులను అనుసరించాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్, వైయస్సార్ జిల్లాలకు నూతన కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా జి.లక్ష్మీ శ, వైఎస్సార్ జిల్లా కలెక్టర్‌గా చెరుకూరి శ్రీధర్‌లను నియమించింది. ఈ రెండు జిల్లాల కలెక్టర్లుగా పనిచేసిన సృజన, శివశంకర్ డీవోపీటీ ఆదేశాల మేరకు ఇటీవల తెలంగాణకు వెళ్లగా వారి స్థానాల్లో రాష్ట్ర ప్రభుత్వం కొత్త కలెక్టర్లను నియమించింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్ లిమిటెడ్ –ఏపీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎం.అభిషిక్త్ కిషోర్‌కు పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి వి. అనిత పేర్కొన్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో రాయలసీమ జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో హోం మంత్రి నిన్న శాంతిభద్రతలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ సాంకేతిక పరంగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని.. స్మార్ట్ పోలీసింగ్ విధానాన్ని తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయి. రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ఫలితాలను విడుదల చేస్తారని ఉన్నత విద్యా మండలి ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో టెట్ పరీక్షను, అక్టోబర్ 3 నుంచి 21 వరకు నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 4 లక్షల 27 వేల 3 వందల మంది దరఖాస్తు చేసుకోగా 3 లక్షల 68 వేల 661 మంది హాజరయ్యారు. 16 వేల 347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరగనుంది.

---------------------------

తెలంగాణలోని వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నిన్న అమ్మవారి దర్శనానంతరం ఆయన పాత్రికేయులతో

మాట్లాడుతూ ఆలయ మాడ వీధులను త్వరితగతిన పూర్తి చేసి, జలాశయాన్ని తాగునీటి జలాశయంగా మారుస్తామని చెప్పారు. వరంగల్‌ను రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో మామునూరులో విమానాశ్రయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా 820 కోట్ల రూపాయలతో రహదారుల మరమ్మతుల కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులోని చాట్రాయి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి నిన్న శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఏలూరు జిల్లాలో 76 కోట్ల రూపాయలతో ఈ పనులు చేపడుతున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ .... 24 సెకన్లు

---------------------------

తెలంగాణలో కొత్త ఎనర్జీ విధానాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. నల్గొండ జిల్లా దామరచర్ల మండలం యాదాద్రి విద్యుత్ కేంద్రాన్ని నిన్న ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2025 మే నాటికి యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ పూర్తి చేసి 4వేల మెగావాట్ల విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామని అన్నారు. కొత్త ఎనర్జీ విధానాన్ని శాసన సభలో చర్చించడంతో పాటు, విద్యుత్ రంగం నిపుణులతోనూ చర్చించి వారి అభిప్రాయాలు తీసుకుంటామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వాతావరణం కలుషితం కాకుండా 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పూర్తి స్థాయిలో రహదారులను అభివృద్ధి చేసేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామంలో రహదారుల మరమ్మతు కార్యక్రమాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిషన్ పాత్ హోల్ ఫ్రీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల మరమ్మతులు చేపట్టి గుంతల్లేని రహదారులు రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను మార్చనున్నామని చెప్పారు. ఈ క్రమంలో రాష్ట్రంలో 826 కోట్ల రూపాయలతో రహదారుల మరమ్మతుల కార్యక్రమాన్ని చేపట్టామని మంత్రి వివరించారు.

---------------------------

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచి తెలంగాణలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని నిన్న సందర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులందరికీ విద్యను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. 16 ఏళ్ల తర్వాత పాఠశాల, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీలు, ఏడేళ్ల తర్వాత డైట్ ఛార్జీలను 40 శాతం పెంచినట్లు మంత్రి చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీ జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి సెక్రటేరియట్ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఉద్యోగులకు సంబంధించిన 18 అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య కార్డులకు నగదు రహిత వైద్య సదుపాయాన్ని కల్పించాలని ప్రభుత్వానికి తెలిపామని ఆయన పేర్కొంటూ...

వాయిస్....28 సెకన్లు

-----------------------------

కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పంచారామాలు, శ్రీశైలం, తెలంగాణాలోని వేములవాడ, రామప్ప, కీసర గుట్ట వంటి శైవక్షేత్రాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. తెల్లవారుజామునుంచే కృష్ణా, గోదావరి స్నాన ఘట్టాల్లో కార్తీకమాస స్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

=======================